# సారీ డియర్!!!!



పవిత్ర, ప్రసాద్‌లది అన్యోన్య దాంపత్యం. ఇద్దరూ ఉద్యోగస్థులే. పెళ్ళయి సంవత్సరం కూడా నిండలేదు. ఇద్దరూ చిలకా గోరింకల్లా ఒకరిని విడిచి మరొకరు వుండలేరు. సెలవు పెట్టినా ఇద్దరూ పెట్టాల్సిందే. ఇద్దరు బస్ స్టాప్‌కి నడిచే వెడతారు. చెరొక బస్సు ఎక్కుతారు. పవిత్ర బస్సుదిగి రెండు వీధులు దాటాక ఆఫీసు. సాయంత్రం 6 గంటలకల్లా పవిత్ర ఇంటికి వస్తుంది. తర్వాత పది నిమిషాల్లో ప్రసాద్ వస్తాడు.

ఓ రోజు ప్రసాద్ ఆఫీసుకు సెలవు పెట్టాడు. కారణం తలనొప్పి. కాని పవిత్ర సెలవు పెట్టాలంటే వీలుపడలేదు. కారణం ఆఫీసులో ఆడిట్ జరుగుతూంది. తప్పనిసరిగా పోవాల్సిందే. భర్తని విడిచి వెళ్ళలేక వెళ్ళింది. సాయంకాలం ఆఫీసునుండి బయటపడింది. వీధిన పోతుంటే దారిని చూచి నడుస్తుందే కాని వచ్చే పోయేవారిని కూడా సరిగా చూడదు. చూడాలంటే భయం.

ఎవరైనా తదేకంగా తనవైపే చూస్తున్నా భయం. నడచి వస్తూంది. వీధిలో రిక్షాలు గాని ఇతర వాహనాలుగాని ఎక్కువలేవు. చెప్పులోకి రాయి చేరింది. వంగిదాన్ని తీయబోయి వెనక్కి చూసింది. తన వెనుక ఎవరో వస్తున్నారు కొద్ది దూరంలో నల్లపాంటు, సమువు స్లాకు, నల్ల కళ్ళజోడు ఎవరో చూడాలంటే భయమేసింది. అడుగులు త్వరత్వరగా వేస్తూంది. వెనుక అతడు వెంబడిస్తున్నాడు కొద్ది దూరంగా. తన మనసు పరిపరి విధాల ఆలోచిస్తూంది. మగ జాతినే నిందిస్తూంది. బస్ స్టాప్ చేరింది. అతడు కొద్ది దూరంలోనే ఆగి వేరే వీధిలోకి వెళ్ళాడు.

ఉసూరుమంటూ ఇంటికి చేరింది. ప్రసాద్ ఇంట్లో పడుకుని వున్నాడు. తలనొప్పి కాస్త తగ్గిందట. మూడు రోజులు సెలవు పెట్టాడట. మరుసటి రోజు కూడా అలాగే అతడు వెంబడిస్తున్నాడు. అదే డ్రస్సు. భయమేసింది. నిలిచి అడగాలనుకుంది. నీ భార్యను ఇలా ఎవరైనా వెంబడిస్తే ఏం చేస్తావని. కాని ధైర్యం చాలలేదు. ఈ విషయం ప్రసాద్‌కి తెలిస్తే. అమ్మో బతక లేదు. తనని ఉద్యోగం మానివేయమంటాడు. ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేస్తేనే అంతంత మాత్రంగా గడుస్తూంది. తను వెను దిరిగి అతడిని పరిశీలనగా చూస్తే తను లోకువై పోవచ్చు. అతడు మరీ దగ్గరకు వస్తాడు. ఆఫీసు చేరింది.

సాయంకాలం మరలా వెంటబడ్డాడు. ఒళ్ళంతా చెమట పట్టింది. ఇంటికి చేరే సరికి ప్రసాద్ ఇంట్లో లేడు. తాళంవేసి వుంది. చీకటి పడింది. ప్రసాద్ కొరకు ఎదురు చూస్తూంది. దూరంగా ఒక వ్యక్తి వస్తున్నాడు. అదే డ్రస్సు భయమేసింది. ఇంటి అడ్రస్సుకూడా తెలుసు కున్నాడు. ప్రసాద్ లేడు. ఇంటికి దగ్గరౌతున్నాడు.

ఒంట్లో దడ ప్రారంభమైంది. తన ముఖం చూపకుండా ప్రక్కకు తిరిగింది. కనపడితే లోపలికి వస్తాడేమో. గేటుతీసిన చప్పుడు. వచ్చేస్తున్నాడు అడుగులు సవ్వడి దగ్గరైంది. పెద్దగా అరుద్దామని నోరెత్తింది.

"సారీ, పవిత్రా. నన్ను మన్నించవూ" ప్రసాద్ గొంతు. అమ్మో గొంతు మార్చి మాట్లాడుతున్నాడని భయపడింది. వెంటనే వెనక్కి తిరిగింది. అదే డ్రస్సులో ప్రసాద్. "ఏంటండీ ఇది. ఈ డ్రస్సేంటి. మీరేంటి." "లేదు పవిత్రా నన్ను మన్నించు. ఇక నిన్ను అనుమానించను. నీలాంటి భార్య దొరకడం నా అదృష్టం. ఉద్యోగంచేసే ఆడవాళ్ళంటే చాలా మందికి లోకువ. వాళ్ళను గురించి పలురకాలుగా మాట్లాడుతారు. ఆ మాటలు విని నిన్ను నేను అనుమానించాను. సెలవు పెట్టి నిన్ను అనుసరించాను. నీకంటే ముందు దగ్గరిదారిలో వచ్చేవాడిని. కానీ ఈ రోజు బస్సు ట్రబుల్. లేటయింది. నీకు దొరికి పోయాను."

"పర్వాలేదులెండి. భలేవారే. నన్నా మీరు అనుమానించేది. నేను మీ పవిత్రనండి. మరయితే ఆ డ్రస్సెక్కడిది."

"అది ఈ నాటకంకోసం నీకు తెలియకుండా కుట్టించాను. ఇది నా అనుమానాన్ని పటాపంచలు చేసింది."

"పదండి ఇక మనల్ని చూస్తే ఎవరైనా దిష్టి పెడతారు. ఆ దిష్టివల్లే ఈ కష్టం వచ్చింది.

—బి. కె. భోగు

